నవతెలంగాణ
ఆదిలాబాద్
సోమవారం | ఫిబ్రవరి 03, 2025 | www.navatelangana.com

రెండు సెల్‌ఫోన్‌ల అప్పగింత

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం పోలీసులు ఇద్దరు బాధితులు పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్‌లను ఆదివారం ట్రేస్ చేసి బాధితులకు అందించారు. మండలంలోని అందవెల్లి గ్రామానికి చెందిన తిరుపతి వన్‌ప్లస్ మొబైల్ పోగొట్టుకోగా, కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఆసిఫ్ వివో మొబైల్ పోగొట్టుకున్నాడు. బాధితులిద్దరూ ఈజ్‌గాం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐఈఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసిన పోలీసులు వాటిని తిరిగి బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేందర్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయిన వెంటనే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే సీఐఈఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరుస్తున్న ఏఎస్ఐ హీరామన్, కానిస్టేబుల్ నయీమ్‌ను ఈ సందర్భంగా ఎస్ఐ అభినందించారు.

గెలుపొందిన వారికి బహుమతులు అందజేత

నవతెలంగాణ-అదిలాబాద్‌రూరల్



ఆదిలాబాద్ మండలంలోని ఖండాల(జీపీ) పొత్తగూడ గ్రామంలో ఆదివారం జోగు రామన్న సహకారంతో జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ దాదాపు నెల రోజుల పాటు నిర్వహించారు. క్రీడల్లో వివిధ మండలాలకు చెందిన 36 టీములు హాజరు కాగా అందులో చిచ్‌ధరి ఖానాపూర్ మొదటి బహుమతి రూ.22000, ద్వితీయ బహుమతి రూ.12000 అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గంద్రత్ రమేష్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. ఇందులో మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, బీఆర్ఎస్ నాయకులు సెవ్వ జగదీష్ యాదవ్, ఆత్రం వెంకటి, గ్రామ పటేల్ బాపురవ్, మాజీ సర్పంచ్ అశోక్, ప్రకాష్, యూత్ ప్రెసిడెంట్ భీంరావ్, దేవ్ రావ్, అంకుష్, కష్ణ, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

డప్పుతో పట్నంకు సిద్ధమవ్వండి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 7న హైదరాబాద్‌లో వేల గొంతులు, లక్ష డప్పుల మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శన ఉందని, ప్రతి ఇంటి నుండి డప్పుతో పట్నం ప్రయాణంకు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం మహా సాంస్కృతిక కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లపల్లి నవీన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మాదిగల చిరకాల స్వప్నం 30 ఏళ్లుగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్యంగా ఈ దేశంలో సుదీర్ఘంగా నడిచిన సామాజిక న్యాయమైన ఉద్యమ స్వరూపాన్ని అర్థం చేసుకొని గౌరవ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ అధికారం రాష్ట్రాలకు కల్పిస్తూ ఈ నెల 1 తీర్పు ఇచ్చిందన్నారు. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణను అమలు చేస్తామని రాష్ట్ర శాసనసభలో మాట్లాడి నేడు అమలు చేయడంతో జాప్యం చేస్తున్నారన్నారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే అమలు చేసి 58 కులాలకు రావలసిన విద్యా ఉద్యోగ రాజకీయ సంక్షేమ రంగాలలో వెనుకబాటుకు గురైన మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని వర్గీకరణను అమల్లోకి తీసుకువచ్చి.. మాదిగల చిరకాల స్వప్నమైన వర్గీకరణకు ముగింపు పలకాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సందూరి వినయ్ సాగర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గైక్వాడ్ సూర్యకాంత్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రాజేశ్వర్, తరుడి శ్రీను టౌన్ ఇంచార్జి మడిపల్లి మనోజ్, దర్శనాల పోచన్న, లక్ష్మణ్, కష్ణ పెల్లి అంకుష్, రోడ్డ గంగన్న, గజ్జల అశోక్, చెంచు రవి, నేరెళ్ల దినేష్ కోడిచెర్ల వేణు, మండలాల నాయకులు పాల్గొన్నారు.

సంఘ బలోపేతానికి కృషి చేయాలి

- సినీ నిర్మాత డాక్టర్ రవికిరణ్ యాదవ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యాదవ సంఘ బలోపేతానికి జిల్లా కార్యవర్గం కృషి చేయాలని సినీ నిర్మాత డాక్టర్ రవి కిరణ్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని యాదవ సంఘ భవనంలో అధ్యక్షుడు కాడిగిరి రఘువీర్ అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా యాదవ సంఘం బాధ్యులు కాసవేణి నారాయణ యాదవ్, భీమన్న యాదవ్, పండరి యాదవ్‌ల ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా అసుర హన్మండ్లు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మంచాల పెద్ద మల్లయ్య యాదవ్‌లను ఎన్నుకున్నారు. ఇది వరకు జిల్లా అధ్యక్షుడిగా సేవలు అందించిన కాడిగిరి రఘువీరా యాదవ్‌ను శాశ్వత ఆహ్వాన అధ్యక్షుడిగా ప్రకటించారు. అనతరం వారిని శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికిరణ్ యాదవ్ మాట్లాడుతూ నూతన జిల్లా కార్యవర్గం యాదవులకు అందుబాటులో ఉండి సంఘ అభివృద్ధికి పాటుపడాలన్నారు. గ్రామ మండల కమిటీలు వేసుకొని సంఘాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు నారాయణ, కృష్ణ మీనన్, సుధాకర్, ప్రకాష్ గణేష్, వెంకట్, ఆశన్న, ప్రఫుల్, రమేష్, వెంకట రమణ, సురేందర్, శ్రీనివాస్, రవికాంత్ పాల్గొన్నారు.

నేడు యధావిధిగా ప్రజావాణి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 3న సోమవారం యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

రిమ్స్‌లో ఎన్‌సీడీ క్లినిక్ ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో ఎన్‌సీడీ క్లినిక్ ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదివారం ప్రారంభించారు. రోగులను పరీక్షించే గది, వ్యాధిగ్రస్తులకు సేవలు అందించే గదులను కలెక్టర్ సందర్శించారు. రిమ్స్‌లో వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించుటకు ఈ క్లినిక్ ప్రారంభించమన్నారు. క్లినిక్‌లో వ్యాధులతో (బీపీ, మధుమేహం, క్యాన్సర్) వాటితో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించడం, ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్, ఎన్‌సీడీ జిల్లా కార్యక్రమ అధికారి శ్రీధర్, రిమ్స్ సుపరెండెంట్ అశోక్, గజానన్, సుమలత, వైద్యులు పాల్గొన్నారు.

పంట బీమాపై ఆశలు..!

పంటల బీమా పథకంపై అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వచ్చే వానాకాలం సీజన్ నుంచి ఈ పథకం అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఈ పథకంపై అత్యున్నత స్థాయిలో చర్చ జరగడం ఇందుకు బలం చేకూరుతోంది. గత కొన్నేండ్ల నుంచి ఆగిపోయిన ఈ పథకం మళ్లీ పున ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో అన్నదాతలకు సైతం మేలు జరగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్రం పంటల భీమా పథకాలను 15వ ఆర్థిక సంఘం పదవీకాలానికి పొడగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇందులో చేరాలని భావిస్తోంది. ప్రస్తుతం యాసంగి సీజన్ ప్రారంభమైన దృష్ట్యా వచ్చే ఖరీఫ్ సీజన్‌కు అన్నదాతలకు ప్రీమియం సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. దీంతో ప్రకృతి విపత్తుల కారణంగా పంటలు నష్టపోయిన సందర్భాల్లో అన్నదాతలకు భీమా సంస్థల నుంచి పరిహారం వచ్చేందుకు ఆస్కారం ఉండటంతో ఈ పథకంలో చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

- వచ్చే వానాకాలం నుంచి అమలుకు కసరత్తు
- నష్టపోయిన సందర్భాల్లో అన్నదాతలకు చేదోడు
- రైతుల ప్రీమియం చెల్లించేందుకు సర్కారు యోచన
- ఉమ్మడి జిల్లాలో 6.10లక్షల మంది రైతులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఎఉమ్మడి జిల్లాలో వాతావరణం భిన్నంగా ఉంటుంది. ఒక ఏడాది వర్షం అధికంగా కురిస్తే..మరో ఏడాది కరువు పరిస్థితులు కనిపిస్తుంటాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిస్తే..మరికొన్ని ప్రాంతాల్లో ఉండని పరిస్థితి. దీంతో అన్నదాతలు ప్రతి ఏటా వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోతూనే ఉన్నారు. ముఖ్యంగా ఈ మూడేండ్లలో అధిక వర్షపాతంతో పంటలు నీట మునగడం.. కొట్టుకుపోవడం వంటి పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ఈ పరిస్థితిలో రైతులకు ప్రభుత్వం సాయం చేయడం తప్పితే మరో మార్గం లేకుండా పోయింది. గతంలో అనేక ఏండ్ల పాటు పంటల బీమా పథకంలో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామమయ్యేది. ఈ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా కంపెనీలకు తమ వాటా కింద 95శాతం చెల్లిస్తే.. రైతు వాటా కింద 5శాతం చెల్లించేవారు. ఆయా పంటలను బట్టి బ్యాంకులు ప్రీమియం కట్ చేసుకునేవి. కానీ 2019 నుంచి అప్పటి ప్రభుత్వం ఈ పథకం నుంచి వైదొలిగింది. 2018 వరకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం రాగా.. 2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో ఈ పథకం అమలు కాలేదు. దీంతో ఆ ఏడాదితో పాటు ఇప్పటి వరకు పంటలు నష్టపోయిన సందర్భాల్లో ప్రభుత్వం ఎకరానికి రూ.10వేల చొప్పున ఒకటి, రెండు సార్లు సాయం అందించింది. అకాల వర్షాలు, ఈదురుగాలులు వచ్చిన సందర్భాల్లో పంటలు నేలకొరి నష్టపోతే వీటికి మాత్రమే ప్రభుత్వం పరిహారం చెల్లించింది. కానీ వాతావరణం అనుకూలించని కారణంగా నష్టపోయే రైతులకు ఎలాంటి పరిహారం దక్కడం లేదు. దీంతో పంటలు నష్టపోయిన సందర్భాల్లో అధికారులు సర్వే చేయడం.. ప్రభుత్వానికి పంపించడం వరకే పరిమితమవుతున్నారు. తప్పితే సర్కారు నుంచి సాయం వచ్చిన సందర్భాలు అంతగా కనిపించడం లేదు. తాజాగా పంటల భీమా పథకంలో చేరితే పంటలు నష్టపోయిన సందర్భాల్లో అధికారుల సర్వే ప్రకారం బీమా కంపెనీలు పరిహారం చెల్లించేందుకు ఆస్కారం ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో 6.10లక్షల రైతులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 6.10లక్షల మంది రైతులు ఉండగా 18లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో అధికంగా 13లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతుండగా.. మిగితా వాటిలో సోయా, కందులు, జొన్న తదితర పంటలు పండిస్తున్నారు. పంటల బీమా పథకంలో భాగంగా పత్తికి వాతావరణ ఆధారిత బీమా అమలు చేస్తుండగా. సోయాకు గ్రామం యూనిట్‌గా..మిగితా పంటలకు మండల యూనిట్‌గా లెక్కించి బీమాను అమలు చేస్తారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో బీమా పథకాన్ని అమలు చేస్తామని చెప్పడమే కాకుండా.. రైతుల వాటా కింద చెల్లించే ప్రీమియాన్ని సైతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని హామీనిచ్చింది. కానీ కిందటి ఖరీఫ్, తాజాగా రబీ సీజన్‌కు మాత్రం అమలు చేయడంలో జాప్యం జరిగింది. వచ్చే వానాకాలం సీజన్‌కు మాత్రం ఈ పథకాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఈ పథకంపై ప్రభుత్వ స్థాయిలో చర్చ జరగడంతో అన్నదాతలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌స్వామిని సంప్రదించగా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు తమకు ఎలాంటి సమాచారం రాలేదని తెలిపారు.

ప్రాజెక్టులు నిర్మించి సాగు నీరందివ్వాలి



నవతెలంగాణ-మంచిర్యాల

కాంగ్రెస్ హామీ ఇచ్చిన హామీల్లో ప్రాణహిత (తుమ్మిడి హెట్టి), కుంటాల జలపాతం ఎగువన కుప్టి ప్రాజెకు నిర్మించి ఉమ్మడి జిల్లాకు సాగు నీరందించాలని, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని రాజకీయ, వామపక్ష ప్రజా సంఘాల నాయకుడు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాలులో జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. దీనికి సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, తెలంగాణ జలసాధన సమితి, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, ఐఆర్‌సీపీ, తెలంగాణ జన సమితి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ (చంద్రన్న), తెలుగుదేశం, తెలంగాణ ప్రజా ఫ్రంట్, సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ప్రభుత్వ హామీలు, విస్మరించిన తీరుపై చర్చించారు. ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్లో జిల్లా స్థాయి సదస్సు జరిగింది. ఉమ్మడి జిల్లాలోని పశ్చిమన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి తూర్పున ప్రాణహిత వరకు పాలకులు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ తుంగలో తొక్కిన, కాంగ్రెస్ హామీ ఇచ్చిన ప్రాణహిత తుమ్మిడిహెట్టి, కుప్టి ప్రాజెక్టులు నిర్మించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో 23 లక్షల ఎకరాల సాగు భూమి ఉంటే కేవలం మూడున్నర లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందన్నారు. 19 లక్షల ఎకరాల భూమి అతి వర్షాలు, కరువుకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి కలివేణి శంకర్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి నాయకులు పాల్గొన్నారు.

పగలు అలా.. రాత్రి ఇలా..

- కలెక్టరేట్ రహదారిలో రాత్రి చిమ్మ చీకట్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పగటిపూట రద్దీగా ఉండే కలెక్టరేట్ రహదారి రాత్రిపూట చిమ్మ చీకట్లు ఉండి ప్రజలకు ఇబ్బందులుగా మారింది. పాత కలెక్టరేట్ నుండి గిరిజన బాలికల



గురుకుల పాఠశాల వరకు రాత్రిపూట ఒక్క వీధిలైట్ కూడా వెలగకపోవడంతో చిమ్మ చీకట్లలో ఉంటుంది. ఇదే రహదారి గుండా సాయంత్రం, ఉదయం అనేకమంది పట్టణ వాసులు వాకింగ్ వెళ్తుంటారు. దీంతో పాటు ఇదే రహదారిలో కలెక్టరేట్, ఎస్పీ, జిల్లా అటవీ శాఖ అధికారి, జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయం కూడా ఉండి లైట్లు లేకపోవడంపై పట్టణవాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై మున్సిపాలిటీ సిబ్బంది నిర్వహణ పరిస్థితి



ఈ విధంగా ఉందంటే మామూలు రహదారుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందని అర్థం చేసుకోవచ్చని పట్టణ వాసులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధిలైట్లు బిగించాలని, కలెక్టర్ దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వాకింగ్ చేసే పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగ విరమణ సహజం

నవతెలంగాణ-బోథ్

ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ సమజమని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో కుమ్మరి పోశెట్టి పదవి విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేకమంది విద్యార్థులను తీర్చిదిద్దారని ఇకపై పదవి విరమణ పొందిన యువకులకు గ్రామంలో మంచి మార్గాలు చూపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ సర్పంచ్ సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్, టౌన్ అధ్యక్షులు ప్రశాంత్, డా.స్వామి పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌లోని వేదమందిర్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని లయన్ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తాము స్థాపించిన శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ, లయన్స్ క్లబ్ సంయుక్తంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు బెల్లంపల్లి లోని లయన్స్ క్లబ్ ఆసుపత్రిలో పది వేలకు పైగా కంటి ఆపరేషన్లను ఉచితంగా చేయించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో ఆపరేషన్లకు ఎంపికైన వారికి తమ సొసైటీ తరపున ఖర్చులకు గాను డబ్బులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ కాళిదాస్ మండల్, డైరెక్టర్ హరిదాస్ సర్దార్, ఠాగూర్ రాయ్, బిస్వాస్, అబీంద్రనాథ్ మండల్, మహానంద మండల్, రన్‌వీర్, అమిత్ బిస్వాస్, రాకేష్, డాక్టర్ శ్రీనాథ్, యశ్వంత్ పాల్గొన్నారు.

ఈనెల 10 నుండి కొత్త డ్రైవింగ్ బ్యాచ్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు మరో కొత్త బ్యాచ్ ఫిబ్రవరి 10 నుండి ప్రారంభం కానున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ 30 రోజుల పాటు ఉంటుందని, లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్సు, బ్యాచ్ నెంబర్ కలిగి ఉన్న అభ్యర్థులు రూ. 15,600 చెల్లించి శిక్షణలో చేరవచ్చని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్ ఎస్కే యుసుఫ్ నెంబరు 9063400628ను సంప్రదించాలని కోరారు.

జిల్లా విద్యాధికారిగా గమినీయల్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా విద్యాధికారిగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న గమినియల్‌కు ఫుల్ అడిషనల్ చార్జి ఇస్తూ విద్యాశాఖ డైరెక్టర్ మదన్మోహన్ ఉత్తర్వులు విడుదల చేశారు. మంచిర్యాల డీఈఓగా ఉన్న ప్రస్తుత ఇన్‌చార్జిగా పనిచేస్తున్న యాదయ్య నేటి నుండి దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో గమేనియల్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదల చేస్తున్నట్లు వాటిలో పేర్కొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకే పట్టం కట్టండి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి అంజి రెడ్డికి విద్యావంతులు పట్టం కట్టాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి పాయల్ శంకర్ కోరారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. రిబ్బన్ కట్ చేసి కార్యాలయం ప్రారంభించినంతరం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉన్న పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపిస్తే ప్రశ్నించే గొంతుకగా ప్రజల ముందు ఉంటారన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యలకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

8న నవోదయ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-కాగజ్‌నగర్

2025-26 విద్యాసంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయాలలో 9, 11వ తరగతులలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 8వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు విద్యాలయం ప్రిన్సిపల్ పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి గాను నిర్వహించే ప్రవేశపరీక్ష ఉదయం 11-15 నుండి ఒకటిన్నర వరకు, 11వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్ష ఉదయం 11 నుండి ఒకటిన్నర వరకు కొనసాగుతుందని, అభ్యర్థులు ఉదయం 9-30 వరకే పరీక్షా కేంద్రానికి రావాల్సి ఉంటుందని సూచించారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వసంత పంచమిని పురస్కరించుకొని నేడు జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం గాయత్రి హోమం తర్వాత అక్షరాభ్యాస కార్యక్రమం ఉంటుందన్నారు. ఆసక్తిగల తల్లిదండ్రులు వినియోగించుకోవాలన్నారు.

ఆశయాలు ఉన్నతంగా ఉండాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఆశయాలు ఉన్నతంగా ఉండి, ఆ దిశగా కార్యాచరణ ఉంటే విజయం తప్పక వరిస్తుందని మోటివేషనల్ స్పీకర్ జయసింహ అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా వచ్చిన జయసింహ భవిష్యత్తులో ఎలా ఉన్నత శిఖరాలు అధిరోహించాలి, జీవితంలో ఎలా స్థిరపడాలి, తల్లిదండ్రులకు మంచి పేరు ఎలా తీసుకురావాలి లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయసింహ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎం కావాలనుకుంటున్నారో ఇప్పడే నిర్ణయించుకొని ముందుకు సాగాలని అన్నారు. జీరో నుండి హీరోలుగా ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెద్ద సమస్యగా మారుతోందని, దీనిని పెంపొందించుకోవాలంటే ఎలాంటి చిట్కాలు తీసుకోవాలో వివరించారు. మామూలు ప్రయాణానికే ఎన్నో ప్రణాళికలు వేసుకునే మనం జీవన ప్రయాణానికి ఎలాంటి ప్రణాళికలు రచించుకోవాలో తెలిసుండాలని అన్నారు. విద్యార్థులతో ఆయన ఆడించిన నెంబర్ మెమరీ గేమ్ వారిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సురవర్ధన్, డైరెక్టర్‌లు జియా ఉల్ హక్, వేద ప్రవీణ్ పాల్గొన్నారు.

అడెల్లి ఆలయాన్ని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని సుప్రసిద్ధ అడెల్లి మహాపోచమ్మ ఆలయాన్ని ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ, ఏఎంసీ చైర్మెన్ తుల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రానికి చెందిన మైస గణేష్ తల్లి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు రితీష్ రాథోడ్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని, భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు కాశవేణి శ్రీనివాస్ యాదవ్, నాయకులు కృష్ణయ్య ముదిరాజ్, శ్రీరామ్, రంజిత్, శ్రావణ్ పాల్గొన్నారు.



విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు



నవతెలంగాణ-నార్నూర్

విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మాతంగ్ రుషి సంస్కార కేంద్రం వ్యవస్థాపకులు సూర్యవంశీ పండరి అన్నారు. ఆదివారం భారత ప్రభుత్వ భూశాస్త్రాల మంత్రిత్వ శాఖ వాతావరణ భూకంప శాస్త్రానికి బాధ్యత వహించే ఐఎండీ ఢిల్లీలో కాంబ్లె సోనీ రెండో ర్యాంకు, కలవలే ఓంకార్ మూడో ర్యాంకు సాధించడంతో ఆదివారం తాడిహత్నూర్ గ్రామంలో వారికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం దళిత రత్న అవార్డు గ్రహీత నర్సింగ్ మోరే మాట్లాడుతూ కలలు కనండి వాటిని సాకారం చేసుకోండని పెద్దల నానుడిని నిజం చేస్తూ, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ప్రతి విద్యార్థి చదువుకొని జీవితంలో మంచి ప్రయోజకులు కావాలని సూచించారు. చెడు అలవాట్లకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. యువత వారి లక్ష్యాలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసై మానసిక రుగ్మతకు గురవుతున్నారని, తల్లితండ్రులు వారిపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాతాంగ్ రుషి సంస్కార్ కేంద్రం కార్యదర్శులు సాగురే, రాజ్‌కుమార్, తరోడే వసంత్‌రావ్, కలువలే అరవింద్, వాగ్మారే వామన్‌రావ్, మెట్టే సదాశివ్, ఘూటే రామారావ్, బాలాజీ, గ్రామ యూత్ సభ్యులు శుభం, ఆశితోష్, విశాల్, సంతోష్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

నవతెలంగాణ-ఇచ్చోడ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న తప్పులే, కేంద్ర ప్రభుత్వం కూడా అవలంబిస్తుందన్నారు. బడుగు బలహీనవర్గాలకి ఉచిత విద్యా, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు కల్పనలో ఏలాంటి శ్రద్ధ తీసుకోక పోగా రాజ్యాంగానికి విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. లక్షల కోట్ల రూపాయలు విద్యా వైద్యం చేతినిండా పని కల్పించడానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లాకి తెలంగాణకి కేంద్ర బడ్జెట్ ఎలాంటి లబ్ధి చేకూరకపోవడం చాలా బాధాకరమన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో అగ్రకుల పార్టీలు అధికారంలో ఉన్నంతవరకు అణగారిన వర్గాలైన బీసీ, ఎస్సీ ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతూనే ఉంటుందని, అందుకే ఆకలి హక్కుల ఉద్యమాలతో పాటు అధికార ఉద్యమాన్ని బలోపేతం చేసి రాజ్యాధికారాన్ని సాధించాలని అన్నారు. 90శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు అధికారాన్ని సాధించేందుకు ధర్మసమాజ్ పార్టీ తీవ్రంగా కృషి చేస్తుందని ఇందులో తెలంగాణలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల నాయకులు పోసుకంటి శేఖర్, దర్శనాల అశోక్, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో యువకుడి మృతి

నవతెలంగాణ-బోథ్



మండలంలోని కరత్వాడ గ్రామానికి చెందిన మెస్రం కృష్ణ(22) విద్యుద్ఘాతంతో ఆదివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ తన పంట చేనులో శనగ పంటకు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్ తీగను కర్ర సాయంతో అమర్చాడు. పనికోసం వెళ్తూ ఒకే సారి విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

ఘనంగా చలి బోనాల ఉత్సవాలు

నవతెలంగాణ-కడెం

మండలంలోని మసాయిపేట్ గ్రామంలో ఆదివారం ఉదయం చలి బోనాల ఉత్సవాలు మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఒక్కరోజు ముందే ఉపవాసంతో చలి బోనాలు వండుకొని బోనాన్ని సిద్ధం చేసుకొని మూడు పోచమ్మల ఆలయానికి మహిళలు సామూహికంగా చలి బోనాలు తలపై ఎత్తుకొని ఆలయానికి చేరుకొని, ఆలయంలో అమ్మవారికి బోనాలు నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. చలి బోనాల ఉత్సవాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : నిర్మల్ పట్టణంలోని బుధవార్‌పేట్, బంగాల్‌పేట్, వెంకటాద్రిపేట్, శాంతినగర్, గొల్లపేట్‌కాలనీల్లోని ఆలయాల్లో ఆదివారం వేకువజాము నుంచి భక్తులు పోచమ్మ తల్లికి చలి బోనాలు సమర్పించారు. మహిళలు ముందు రోజు రాత్రి తలస్నానం చేసి అమ్మవారికి కొత్త కుండలో బోనాన్ని వండి మరుసటి రోజు ఉదయం పెరుగుతో కలిపిన నైవెద్యాన్ని పసుపు ఆకులలో సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని భక్తులు తెలిపారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారు భక్తులను చల్లగా చూడాలని వేడుకున్నారు.



దారులన్నీ.. నాగోబా వైపే..

- జనంతో కిక్కిరిసిన నాగోబా జాతర..
- దర్శనానికి బారులు తీరిన భక్తులు..



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

నాగోబా జాతర ప్రారంభమై ఐదో రోజులుగా కొనసాగుతుంది. దీంతో దారులన్నీ నాగోబా వైపే చూస్తున్నాయి. ఈ జాతరకు జిల్లా ప్రజలే గాక పక్క రాష్ట్రంలోని చంద్రాపూర్, యావత్మాల్, నాందేడ్, తదితర ప్రాంతాల నుంచి భక్తులు తండోప తండాలుగా తరలి వస్తున్నారు. మరోవైపు ఆదివారం వివిధ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు సెలవులు ఉండటంతో జాతరకు భక్తుల తాకిడి ఎక్కువైంది. దీంతో నాగోబా దర్శనానికి భక్తులు గంటల తరబడి బారులు తీరారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, జాతర ప్రారంభం నుంచి ముగిసే వరకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ, మాజీ సర్పంచుల సంఘం మండలాధ్యక్షులు కినక జుగాదిరావ్ ఆధ్వర్యంలో రక్షిత తాగునీటి సౌకర్యం కల్పించారు. జాతరలో ఎక్కడ చూసినా తాగునీరు అందుబాటులో ఉంది.

రంగుల రాట్నంకు భలే గిరాకీ..

జాతరకు కుటుంబ సమేతంగా వచ్చిన ప్రతి ఒక్కరూ రంగుల రాట్నంలో కూర్చీ బేడుతున్నారు.



అనంతరం జాతరలో జిలేబీ, వివిధ తినుబండారాలను ఆరగిస్తున్నారు. చిన్న పిల్లలకు అవసరమగు వివిధ ఆటవస్తువులు కొనుగోలుచేయడంలో అగుపించారు. దీంతో జాతరలో వెలసిన దుకాణాలకు భలే గిరాకీతో బీజీగా గడిపారు. నాగోబా గుడి పక్కన భక్తులకు రోజు కొక్కరు దాతలు అన్నదానం నిర్వహించడంతో భక్తులు అన్నదాన ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు.

జాతరలో ఆర్టీసీ సేవలు..

నాగోబా జాతర ప్రారంభం నుంచి ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రయాణికులకు బస్సు సౌకర్యాలను కల్పిస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చే ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్ వైపు వెళ్లె ప్రతి బస్సు సర్వీసులను వయా కేస్లాపూర్ మీదుగా నడిపిస్తున్నారు. దీంతో సుదూర ప్రాంత ప్రజలకు బస్సు సౌకర్యం ఉండటంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ జాతర ఈనెల 4 వరకు కొనసాగనుంది.

లక్ష్యం ఎంచుకొని ఆ దిశగా సాధన చేయాలి

- ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాక్ టెస్ట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కష్టపడ్డవారికే భవిష్యత్తు ఉంటుందని, లక్ష్యం ఎంచుకుని ఆ దిశగా సాధన చేస్తే తప్పకుండా జీవితంలో విజయం సాధిస్తారని, ఉన్నతస్థాయికి ఎదుగుతారని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి దిశానిర్దశం చేశారు. ఆదివారం పట్టణంలోని విద్యార్థి కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆదివారం మాక్‌టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంది శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవ్వగా ఆయన చేతుల మీదుగా ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. అనంతరం విద్యార్థులందరికీ ఎగ్జామ్ మంచిగా రాయాలంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. పదో తరగతి పరీక్షలు జీవితానికి పునాది వంటివని, మంచిగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కష్టాన్ని నమ్ముకుని కృషి, పట్టుదలతో ముందుకుసాగాలని, అప్పుడే బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఉన్నత ఉద్యోగాలు సాధించి ఆదిలాబాద్ అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని, ఇక్కడ పరిశ్రమల స్థాపనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కష్టాన్ని నమ్ముకున్నవారికి విజయం వారి బానిస అవుతుందన్నారు. త్వరలోనే కెరీర్ గైడెన్స్‌పై కేఎస్ఆర్ ఫౌండేషన్, అమ్మన్యూస్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి శాంతన్‌రావు, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, యెల్మ రాంరెడ్డి, షకీల్, రఫిక, డేరా కృష్ణారెడ్డి, గడ్డం అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

నవతెలంగాణ-తాంసి

రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబంలో తమ కుమారుడు కిడ్నీ వ్యాధితో బాధపడంతో ఏమి చేయలేని స్థితిలో కుటుంబం దీనస్థితిగా అపన్నా హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెళితే తాంసి మండల కేంద్రానికి చెందిన కొట్రాంగి ఇస్తారు గౌరుభాయి దంపతుల కుమారుడు కొట్రాంగి అశోక్(21) కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. గత ఐదు నెలలు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం డయాలసిస్‌తో చికిత్స అందిస్తున్నారు. వారిని నిరుపేద కుటుంబం వ్యవసాయ కూలీలుగా తల్లిదండ్రులు పనిచేస్తుంటారు. కూలి పని చేస్తేనే పూట గడిచే ఆ కుటుంబంలో ఈ వ్యాధి తన కుమారునికి రావడంతో ఏమి చేయలేక దీనస్థితిలో ఉన్నారు. అశోక్ స్నేహితులు తలో కొంత వేసుకొని హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించారు. తప్పనిసరిగా డయాలసిస్ చేయించాల్సిందేనని వైద్యులు తెలపడంతో ఏమి చేయలేక ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో డయాలసిస్ చేస్తున్నారు. వారానికి ఒకసారి తప్పకుండా హైదరాబాద్‌కు వైద్యం కోసం వెళ్లాల్సి రావడంతో చేతిలో డబ్బులు లేక దాతలు సహకారం అందించాలని సహకారం కోసం ఎదురుచూస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- నాగోబా జాతరకు వెళ్లి వస్తుండగా ప్రమాదం



నవతెలంగాణ-ఇచ్చోడ

నాగోబా జాతరకు వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని దుబార్‌పేట్ గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మావడ మండలం పులిమడుగుకు చెందిన మాడవి రాజు(30) మృతుడు, స్నేహితుడు తులసిరామ్ కలిసి నాగోబా జాతరకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై రాజు తన మోటార్ సైకిల్‌ను అతివేగంగా నడుపుతూ, లారీని ఓవర్ టేక్ చేయబోయి, సడన్ బ్రేక్ వేయడం వలన అదుపు తప్పి రోడ్డుపై పడగ తల రోడ్డుకు బలంగా తగలడం వలన నోటి నుంచి ముక్కు నుంచి రక్తం రాగా, తులసిరామ్‌కు తలకు స్వల్పగాయలు గాయాలు అయినా సమాచారం అందుకున్న హైవే సిబ్బంది, సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్‌లో రిమ్స్ ఆస్పత్రికి తరలించగా రాత్రి 10.50గంటలకు రాజు మరణించినట్టు డాక్టర్లు నిర్ధారణ చేసినట్టు తెలిపారు. మృతుని అక్క ఆడే శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తిరుపతి తెలిపారు.

గిరిజన యూనివర్సిటీలకు బడ్జెట్‌లో అన్యాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల గిరిజన యూనివర్సిటీలకు తీవ్ర అన్యాయం చేసిందని, తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం (టీఏవీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం తనుష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక వైపు ప్రయివేట్ యూనివర్సిటీలకు కోట్ల రూపాయల వరాల జల్లులు కురిపించిన కేంద్రం, గిరిజన యూనివర్శిటీల అభివృద్ధికి మాత్రం ప్రత్యేక నిధులను అస్సలే కేటాయించలేదని పేర్కొన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి ఏ మాత్రం గిరిజనుల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉన్నా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం మరియు భారత రాజ్యాంగంలో పొందు పరచిన ఆర్టికల్ 371 (డీ),(ఇ) ల ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల గిరిజన యూనివర్శిటీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బీసీ సంఘం ఎన్నిక



నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలో ఆదివారం ముధోల్ బీసీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గత కార్యవర్గం కాలపరిమితి రెండు సంవత్సరాలు ముగియడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వరగంటి విఠల్, ఉపాధ్యక్షులుగా పల్లోళ్ల నగేష్, కార్యదర్శిగా భూమన్న, కోశాధికారిగా జిందంవార్ వెంకటేష్, సహాయ కార్యదర్శిగా టి.దశరథ్, ఎన్నికయ్యారని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్నికైనా నూతన కార్యవర్గంకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రోళ్ల రమేష్, నారాయణ, ఆనంద్ పటేల్, మైత్రి సాయినాథ్ పాల్గొన్నారు.

కార్పొరేట్‌లకు లాభం చేకూర్చే బడ్జెట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2025-26 కేంద్ర బడ్జెట్ కార్పొరేట్‌లకు లాభం చేసేలాగా, పేదలను నిర్మూలించేలా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంక రాఘవులు, ఆశన్న ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీహార్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆ రాష్ట్రాల్లో గెలుపు కోసం బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని ఆరోపించారు. మరోమాటలో చెప్పాలంటే సంపదను సృష్టించే పేదలను, కార్మికులను, వ్యవసాయ కార్మికులు, రైతులకు నష్టం చేసే బడ్జెట్‌గా ఉందని పేర్కొన్నారు. పేదలను నిర్మూలించే బడ్జెట్‌గా ఉందన్నారు. ఈ బడ్జెట్ ఆదిలాబాద్ జిల్లాకు ప్రతి సంవత్సరం లాగా మొండి చేయి, చూపిందన్నారు. ఈ బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని, వారం రోజుల పాటు నిరసనలు తెలపాలని పేర్కొన్నారు.

బడ్జెట్‌లో గుండుసున్నా..

- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రజానీకానికి రామ నామాన్ని వినిపిస్తూ, అదే ప్రజలపై వందల కోట్ల రూపాయల భారాన్ని కూడా మోపుతున్నారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు 16 మంది ఎంపీలు ఉండి కూడా గుండు సున్నా రావడం సిగ్గుచేటన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్ అంశాలపై చర్చించి తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఖండించారు. స్థానిక ఎంపీ ఎమ్మెల్యే, ఎన్నికల ముందు రామనామం జపిస్తూ శ్రీరామరాజ్యం లాంటి పాలన వస్తుందని అనుకుంటూ జనాలు నమ్మి ఓట్లేసి వేసి గెలిపిస్తే తీరా అదే ప్రజలను మోసం చేయడం జరుగుతుందన్నారు. భారత 13వ ప్రధాని కాలంలో రూ.65 లక్షల కోట్ల బాకీ ఉంటే, నేడు ప్రజలపై భారత ప్రధాని రూ.125 లక్షల కోట్ల అప్పులు చేయడం విడ్డూరమన్నారు. ఆదిలాబాద్‌లో సీసీఐ పరిశ్రమ, టెక్స్‌టైల్ పార్కు, ఏర్పాటు మంజూరు చేపిస్తామని పలికిన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు వాటిపై స్పందించకుండా ఉండడం వారి అసమర్ధ పాలనకు నిదర్శనం అన్నారు. గతంలో కేసీఆర్ ఎన్వోసీ ఇవ్వకపోవడంతోనే ఏర్పాటు పనులు ఆగిపోయాయని ప్రశ్నించిన ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రస్తుతం ఏర్పాటు విషయంలో ఎవరు అడ్డం వస్తున్నారో తేల్చి చెప్పాలన్నారు. ప్రజలకు సమాధానం చెప్పలేని తరుణంలో స్థానిక ఎంపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ జిల్లాలో ఎలాంటి అభివద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే సహకరించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒత్తిడి పెంచకపోవడం పై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఆరోపించారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే వారి దందాలు రికమండేషన్లు, పైరవీలపై ఉన్న శ్రద్ధ అభివద్ధిపై చూపించాలని హితవు పలికారు. సమావేశంలో విజ్జగిరి నారాయణ, ధమ్మాపాల్, కొండగణేష్, బట్టుసతీశ్, అత్తరుల్లా, దేవిదాష్ ,శ్రీనివాస్, మొర్య సురేందర్, రాహుల్, షేక్ ఆలం, మహేష్ పాల్గొన్నారు.

చింతపండు నవీన్‌పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్



చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ జనవరి 29న వరంగల్‌లో జరిగిన విద్యుత్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో రెడ్డి కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసి, రెడ్డి మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం రెడ్డి కులస్తులు పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల రెడ్డి సంఘ సభ్యులు వంగ భూమారెడ్డి, రాజు, పటేల్ ప్రకాష్‌రెడ్డి, లక్కడి మధుకర్‌రెడ్డి, లక్కడి శంతన్‌రెడ్డి, సోమిరెడ్డి అఖిలేష్ రెడ్డి పాల్గొన్నారు.

ధారవత్ ప్రవీణ్ నాయక్‌కు సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్

దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ధారవత్ ప్రవీణ్ నాయక్‌ను ఆదివారం ఎస్ఆర్ నగర్ ప్రజలు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తను ప్రజలకు సేవ చేయాలనే ఉద్యేశంతో ముందుకు వెలుతున్నానని అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు సహాయ సహాకారాలు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో జైతు, వసంతరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని గాజులపేట్, విశ్వనాథ్‌పేట్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ నాగరాజు ఆదివారం ఓక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గాజులపేట్, డాక్టర్స్ లైన్, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి నివాసం, బైల్ బజార్, మోచి గల్లీ, బుధవార్‌పేట్, గాంధీచౌక్, నాయిడువాడ, బోయివాడ, రామ్‌రావు భాగ్, బంగల్‌పేట్ ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని పేర్కొన్నారు.

లక్షల డప్పులు వేల గొంతుల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-బెజ్జూర్



మండల కేంద్రంలో ఆదివారం లక్షల డప్పులు వేల గొంతుకలు కార్యక్రమ గోడ పోస్టర్లను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కోంద్ర బ్రహ్మయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈనెల 7న నిర్వహించే లక్షల డబ్బులు వేల గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి జిల్లాలోని ప్రతి గడప నుండి ప్రతి ఒక మాదిగ బిడ్డ కార్యక్రమానికి బయలుదేరి రావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పెగడపల్లి తిరుపతి, నాయకులు చిప్పకుర్తి పురుషోత్తం, అడ్డూరి శ్రీనివాస్, ఇప్ప శేఖర్, తైదల ఇస్తారి, పేగడపల్లి సురేష్, తోటపల్లి మహేష్, చిప్పకుర్తి రంగయ్య, చిప్పకుర్తి సంజీవ్, రాజేష్, తోటపల్లి మహేష్, తోటపల్లి ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్ అన్నారు. 38వ జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు కీర్తన, దీప్తి, వెంకటేష్‌లను జిల్లా కార్యదర్శి తిరుపతితో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 12వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో నిర్వహించే 38వ జాతీయ స్థాయి క్రీడలకు జిల్లా నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సమి పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో బర్డ్ వాక్ ఫెస్టివల్



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

అటవీ శాఖ ఆధ్వర్యంలో పెంచికల్ పేట్ రేంజ్ పరిధిలో పక్షుల అధ్యయనానికి బర్డ్ వాక్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. మండలంలోని ఎల్లూరు గ్రామ శివారులో గల బొక్కివాగు ప్రాజెక్టు వద్ద డీఎఫ్ఓ నీరజ్ కుమార్ టిబ్రివాల్, ఎఫ్‌బీఓ సుశాంత్ సుకుదేవ్ బర్డ్ వాక్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 27 మంది ఔత్సాహికులు క్షేత్ర పర్యటనకు వచ్చారు. రేంజ్ పరిధిలోని బొక్కివాగు ప్రాజెక్టు వద్ద ఉదయం ఔత్సాహికులు తమ తమ కెమెరాలలో పక్షులను బంధిస్తూ ముందుకు సాగారు. మండలంలో కొన్ని ప్రాంతాల్లో ఉన్న వృక్ష శిలాజాలను ఔత్సాహికులకు అటవీ శాఖ అధికారులు చూపించారు. పాలరాపు గుట్ట వద్దగల రాబందుల స్థావరాలను సందర్శించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాహనాల్లో వారు పర్యటిస్తూ పక్షులను కెమెరాలలో బంధించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారులు జగన్, జమీల్, ఆత్మ, బీట్ అధికారులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

మహా సమ్మేళనం విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఫిబ్రవరి 16న స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో నిర్వహించే పూర్వ విద్యార్థుల మహ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆవరణలో నిర్వహణ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 16 ఆదివారం జరిగే పూర్వ విద్యార్థుల మహా సమ్మేళన కార్యక్రమంలో 1979 పాఠశాల ప్రారంభం నుండి ఇప్పటివరకు చదివిన విద్యార్థులతో పాటు విద్యాపీఠంలోని ఇతర శిశుమందిర్‌లో చదివి ప్రస్తుతం ఆసిఫాబాద్‌లో నివసిస్తున్న వారు సైతం పాల్గొనవచ్చని తెలిపారు. దూర ప్రాంతాల నుండి వచ్చే పూర్వ విద్యార్థులు, ఆచార్యులకు పాఠశాలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో నిర్వాహక కమిటీ అధ్యక్షుడు గద్దెలపల్లి వెంకటేశ్వర్లు, సహ కార్యదర్శి పుల్లూరి సంతోష్, కృపాల్, వెంకటరమణ, నాగుల శ్రీనివాస్, కొడిపాక వేణుగోపాల్, కొండ శశాంక్, ప్రదీప్, మెంగ్రే రాహుల్, రఘువీర్, సాయికిరణ్, రాపర్తి ప్రశాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండేటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అరుణ హోమం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పెద్దవాగు వద్ద గల బాలేశ్వరాలయంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం అర్చకులు శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అరుణ హోమం ఆద్యంతం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రథసప్తమి వారోత్సవాల్లో భాగంగా అరుణ హోమం నిర్వహించడం జరిగిందని, దీని ద్వారా సూర్య భగవానుని అనుగ్రహం కలగనున్నట్లు వివరించారు. హోమం అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు అజయ్, విజయ్ కుమార్ శర్మ, బాలేశ్వర్, అశోక్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ భర్తకి పరామర్శ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆసిఫాబాద్ మాజీ సర్పంచ్ సరస్వతి భర్త తిరుపతిని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ అలి బిన్ అహ్మద్, పార్టీ మండల అధ్యక్షులు జబరీ రవీందర్, పట్టణ అధ్యక్షులు అహ్మద్, ఇదులవాడ మాజీ సర్పంచ్ బూసీ భీమేష్, అప్పపెల్లి మాజీ సర్పంచ్ బాబురావు, నాయకులు నిషార్ పాల్గొన్నారు.

పోరు బాటలో ఉపాధి సిబ్బంది

- మూడు నెలలుగా వేతనాలు రాక అవస్థలు
- సమస్యల పరిష్కారానికి ఆందోళన
- ఈనెల 12 వరకు స్పందించకపోతే సమ్మె



నవతెలంగాణ-కెరమెరి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో పని చేస్తున్న సిబ్బంది నిరసన బాట పట్టారు. సకాలంలో వేతనాలు అందక అధికారులు, సిబ్బంది ఆందోళనకు దిగారు. బుధవారం నుంచి మండల ప్రజాపరిషత్ కార్యాలయాల ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు ప్రారంభించారు. గురువారం జిల్లావ్యాప్తంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీఓలకు వినతిపత్రాలు అందించి సమస్యలను విన్నవించారు. వచ్చే నెల(ఫిబ్రవరి) 12 వరకు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. 29, 30వ తేదీల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి ఎంపీడీఓలు, తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేత, ఈనెల 31, ఫిబ్రవరి 1న సిబ్బంది పెన్‌డౌన్, రెండు మూడు తేదీల్లో ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతిధులు, 4న కలెక్టర్‌ను కలిసి సమస్యలు విన్నవించడం, 5న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన, టీఎన్జీఓ, టీజీఓ ఉద్యోగ సంఘాల నాయకులకు, 7న ప్రజాభవన్‌లో, 8న హైదరాబాదులోని పీఆర్అండ్ సీఆర్డీ కమిషనర్ కార్యాలయంలో, 9,10 తేదీల్లో మంత్రులకు వినతులు, 11న కమిషనర్ పీఆర్అండ్‌సీఆర్డీ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన తదితర కార్యక్రమాలు, 12న కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేయాలని నిర్ణయించారు. అప్పటివరకు ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెబాట పట్టాలని తీర్మాణం చేశారు.

వేతన వేతలు...

జిల్లాలో ఉపాధి హామీలో ఏపీఓలు 12 ఇంజనీరింగ్, కన్సల్టెంట్లు, అటెండర్లు 7 కంప్యూటర్ ఆపరేటర్లు 36, టెక్నికల్ అసిస్టెంట్లు 75, ఫీల్డ్ అసిస్టెంట్లు 149 మొత్తం 287 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి గత నవంబర్ నుంచి వేతనాలు అందడం లేదు. ప్రతినెల ఎఫ్‌టీఓ(ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) జనరేట్ చేసి పంపుతున్న వేతనాలు విడుదల చేయడం లేదు. రాష్ట్ర శాఖలో బడ్జెట్ లేకపోవడంతోనే వేతనాలు ఆలస్యం అవుతున్నాయని ఉద్యోగులు పేర్కొంటుండగా, సాంకేతిక కారణాలతో అలసమవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులరైజేషన్ చేయాలని, ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని, పెట్రోల్ అలవెన్స్ ఇవ్వాలని కోరుతున్నారు. ఉపాధి సిబ్బంది నిరసనతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథక అమలు ఉపాధి పనులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. మార్చి 31లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది, కూలీలను పనులకు రప్పించడం హాజరు నమోదు చేయడం వంటి పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది.

ఇబ్బంది పడుతున్నాం

ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య కెరమెరి



ఉపాధి హామీ సిబ్బంది వేతనాల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు సకాలంలో జీతాలు అందుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వానికి అధికారులకు ఎన్నోసార్లు విన్నవించిన ఫలితం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

12 వరకు నిరసనలు

చందు, ఫీల్డ్ అసిస్టెంట్, కెరమెరి



న్యాయపరమైన సమస్యలతో పాటు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఆందోళనలు చేపడుతున్నాం. ఈ నెల 12 వరకు రోజువారిగా ఆందోళనలు కొనసాగిస్తాం. శాంతియుత నిరసనల ద్వారా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నత అధికారులను అందరిని కలుస్తాం. సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెబాట చేపడుతాం.

ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా నోడల్ అధికారి సిహెచ్.కళ్యాణి
- 23 ప్రయోగ కేంద్రాల్లో సీసీ కెమెరాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పరీక్షలు ఉన్నత స్థాయి అధికారులకు కత్తిమీద సాము లాంటివి. ఎక్కడ ఎటువంటి చిన్న లోపం తలెత్తినా రాష్ట్ర స్థాయి అధికారులకు సమాధానం చెప్పుకోవాల్సిన బాధ్యత జిల్లా స్థాయి అధికారులపై ఉంటుంది. మౌలిక వసతుల కల్పన, పేపర్ల అందజేత, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడం, సిబ్బందిని సిద్ధం చేయడం ఇలా అనేక విధులు నిర్వహిస్తూ పరీక్షలు పూర్తయ్యేంతవరకు నిమిష విరామం లేకుండా జిల్లా అధికారులు పని చేయాలి. నేటి నుండి జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానుండగా, ప్రధాన పరీక్షలు ఫిబ్రవరి 28 నుండి జిల్లాలో ప్రారంభం కానున్నాయి. ప్రధాన పరీక్షల కూడా ఇంతే మొత్తంలో సన్నద్ధమవుతూ సిబ్బందిని సిద్ధం చేయడంతో పాటు అవసరమైన సదుపాయాలను కల్పించాలని ఎక్కడ లోటుపాట్లు లేకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని, ప్రాక్టికల్ పరీక్షలు కూడా సీసీ కెమెరాలు నియంత్రణలో నిర్వహిస్తున్నామని చెబుతున్న ఇంటర్మీడియెట్ జిల్లా నోడల్ అధికారి సీహెచ్.కళ్యాణితో ఈనాటి ముఖాముఖి.

నవతెలంగాణ : జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఎంత మంది విద్యార్థులు హాజరుకానున్నారు?

నోడల్ అధికారి : జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షల కోసం మొత్తం 10,043 మంది హాజరు కానుండగా, వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 4756 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5287 మంది ఉన్నారు.

నవతెలంగాణ: నేటి నుండి ప్రారంభమయ్యే ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు ఎలా చేశారు..?

నోడల్ అధికారి : జిల్లాలో నేటి నుండి 17 వరకు మూడు విడతల్లో ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. దీనికి 3,459 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో జనరల్ విద్యార్థులు 1929 కాగా వృత్తి విద్య విద్యార్థులు 1530 ఉన్నారు. వీరి కోసం జిల్లాలో మొత్తం 23 ప్రయోగ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించాం.

నవతెలంగాణ: ప్రాక్టికల్ పరీక్షల్లో మొట్టమొదటిసారిగా సీసీ కెమెరాలను అమల్లోకి తీసుకువచ్చారు. దీనిపై మీ స్పందన ఏమిటి?

నోడల్ అధికారి: విద్యార్థుల్లో ప్రాక్టికల్స్ పట్ల నిబద్ధత పెరిగే అవకాశం ఉంటుంది. జిల్లాలోని 23 సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసాం.

నవతెలంగాణ: జిల్లాలో ప్రధాన పరీక్షలకు ఎన్ని కేంద్రాలను ఏర్పాటు చేశారు?

నోడల్ అధికారి: జిల్లాలో మొత్తం 48 జూనియర్ కళాశాలలుండగా వీటిలో చదువుతున్న విద్యార్థుల కోసం ఈ నెల చివర్‌లో ప్రారంభం కానున్న ప్రధాన పరీక్షలకు 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. వీటిలో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలు, 2 ప్రయివేట్, 2 ఆదర్శ పాఠశాలలు, రెండు గిరిజన సంక్షేమ శాఖ కళాశాలల, 1 ఎంజేపీ, 1 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశాము.

నవతెలంగాణ: పరీక్షల నిర్వహణకు సిబ్బందిని ఏ విధంగా కేటాయించారు..?

నోడల్ అధికారి: జిల్లాలో మొత్తం 19 సెంటర్లు ఏర్పాటు చేయగా ఈ 19 సెంటర్ నిర్వహణ కోసం ప్రతి సెంటర్‌కు ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను నియమించనున్నాం. వీరితో రాబోయే పక్షం రోజుల్లో సమావేశం నిర్వహించి పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తామం.

నవతెలంగాణ: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ నడుస్తోందనే వదంతులు ఉన్నాయి. వీటిని తొలగించడానికి మీరు ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

నోడల్ అధికారి: జిల్లాలో 19 సెంటర్లకు కూడా పకడ్బందీగా సిబ్బందిని నియమించాం. ఎక్కడ కూడా మాస్ కాపీయింగ్ జరగకుండా పూర్తి స్థాయిలో ప్రయత్నాలు చేస్తాం. దీనికోసం ప్రత్యేకంగా ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంతో పాటు ఇద్దరు సభ్యులతో ఒక్కో టీమ్ చొప్పున రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయనున్నాం. వీటి ద్వారా 19 సెంటర్లను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తాం. పూర్తిస్థాయిలో మాస్ కాపీయింగ్ నిరోధించడానికి అన్ని చర్యలు చేపట్టాం.

నవతెలంగాణ: జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటు చేశారా..?

నోడల్ అధికారి: జిల్లాలో 11 ప్రభుత్వ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. వీటిలో కొన్నింటిలో చిన్నచిన్న ఇబ్బందులు ఉన్న వాటిని అధిగమించడానికి ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌తో ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతున్నాం. పరీక్ష రాసే విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో ఎటువంటి ఇబ్బందులు కాకుండా చూసుకోవాలని ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులకు కావాల్సిన తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, బల్లలు లాంటివి ఏర్పాటు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం.

నవతెలంగాణ: పరీక్షలు రాయనున్న విద్యార్థులకు మీరిచ్చే సందేశం ఏమిటి..?

నోడల్ అధికారి: నేటి నుండి ప్రారంభమయ్యే ప్రాక్టికల్ పరీక్షలు విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష రాయాలి. మొదటిసారి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు విద్యార్థులు పడకూడదు. ఇప్పటికే ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులను అధ్యాపకులు సిద్ధం చేశారు. దానిని ఉపయోగించుకుని విద్యార్థులు బాగా పరీక్షలు రాసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి.

ఘనంగా గోండి భాషా దినోత్సవం



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆదివారం గోండి భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల రాయి సెంటర్ సార్మెడి కొడప శంకర్ మాట్లాడుతూ పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తి గోండి భాషా అని అన్నారు. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గోడి భాషా అభివృద్ధి కోసం మోతిరాం రావణ్ కంగాలి లాంటి మహాత్ములు ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని గోండిభాషా దినోత్సవాన్ని మండల కేంద్రంలో నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. గోండు సమాజానికి చెందిన భారతీయ భాషావేత్త, రచయిత అతను గోండి భాషా మూలాలు, అభివృద్ధిపై తన పనికి ప్రసిద్ధి చెందారన్నారు. ముఖ్యంగా దాని కోసం లిపిని రూపొందించినందుకు కంగళి ఆంగ్లం, హిందీ, మరాఠీ భాషాలలో గోండి నిఘంటువులను రచించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపమేడి ఆత్రం బక్కయ్య, సలహాదారు ఏణుక శంకర్, ఆదివాసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు సిడం సకారం, కార్యదర్శి కొడప పుల్లయ్య, మేడి సతీష్, ఆత్రం గంగారం, తొర్రెం ప్రశాంత్, పోల్కు వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి తుకారాం, కోలావర్ సంఘం మండల నాయకులు పెద్దల శంకర్, ఉపాధ్యక్షులు మేకల శ్యామ్‌రావు, ఆదివాసీ మహిళా మండల అధ్యక్షులు ఏణుక అమృత, పోరిశెట్టి పద్మ, జిల్లా సమైక్య అధ్యక్షురాలు పోరిశెట్టి శ్రీదేవి, ఆత్రం రోజా, మడవి లక్ష్మి, సుజాత, శారద, గంగుబాయి, పార్వతి పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ఉన్నా.. ఉపయోగం సున్నా..!

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో ఇటీవల నిర్మించిన నాలుగు వరుసల రహదారిలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టర్ ప్రయాణికులకు ఉపయోగకరంగా లేదు. ఎక్కడానికి పిడిల్ కూడా కట్టకపోవడంతో ప్రయాణికులు బస్ షెల్టర్ కింద కాకుండా రోడ్డుపై బస్సుల కోసం పడికాపులు కాయాల్సి వస్తుంది. మండలకేంద్రం నుండి వచ్చే వారితో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చే వారికి ఇక్కడ మూత్రశాలలు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించలేదు. మహిళలు, చిన్నపిల్లలు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. రోడ్డుకు ఇరు పక్కల గల హోటళ్ల నుండి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కొట్టక్కర్ పోచయ్య..



మండలకేంద్రంలో బస్ షెల్టర్ ఉన్న ప్రయాణికులకు నిరుపయోగంగా ఉంది. బస్ షెల్టర్‌కు పిడిల్ లేకపోవడంతోనే ఎవరు కూడా అందులోకి వెళ్లి కూర్చోవడం లేదు. పక్కన గల రోడ్డుపై నిలబడి బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అన్ని సౌకర్యాలు కల్పించాలి.

కేంద్ర బడ్జెట్‌పై ప్రజా సంఘాల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంట్‌లో శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలో పజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ మాట్లాడుతూ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక, ఆర్థిక సంస్కరణల కొనసాగింపే ఈ బడ్జెట్ అన్నారు. రూ.50 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ గత బడ్జెట్ కంటే సుమారు రూ.3 లక్షల కోట్లు అదనంగా కేటాయించిన జీడీపీ లోటు 4.4 శాతంగా చూపడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నదన్నారు. బీమా రంగంలో 100శాతం ఎఫ్‌డీఐని వ్యతిరేకిస్తూ, విద్యుత్ సంస్కరణ, వికసిత్ భారత్ బడ్జెట్ కాదని కార్పొరేట్ సంస్థల బడ్జెట్ అని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్‌పై పన్నులు రద్దు చేయాలన్నారు. ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిధులు పెంచాలని, కార్మిక సంస్కరణలను వ్యతిరేకిస్తూ 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కేంద్ర పథకాలకు నిధులు పెంచాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలన్నారు. ధరల స్థిరీకరణకు బడ్జెట్‌లో నిధులు పెంచాలని, విభజన హామీల అమలుకు బడ్జెట్ కేటాయించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలన్నారు. ఎన్నికల కోసం బీహార్‌కు వరాలు, తెలంగాణకు మొండి చేయి చూపడం దారుణమన్నారు. ఈ నిరసనలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టికనంద్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలశ్రీ పాల్గొన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

- అదనపు ప్రాజెక్టు అధికారి రామకృష్ణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమగ్ర గిరిజన అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు ప్రాజెక్టు అధికారి రామకృష్ణ తెలిపారు. ఆదివారం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ఆధ్వర్యంలో అడ ప్రాజెక్టు వద్ద నిర్మించిన లేక్ వ్యూ రెస్టారెంట్‌ను జేడీఎం నాగభూషణం, ఆసిఫాబాద్ వెలుగు మహిళా మండల సమాఖ్య ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేక్ వ్యూ రెస్టారెంట్ పరిధిలో ఆసిఫాబాద్ వెలుగు మహిళ మండల సమాఖ్య ద్వారా భీమన్న వీఓఏ ద్వారా 5 మంది మహిళలతో జాయింట్ లయబులిటీ గ్రూప్ ఏర్పాటు చేసి ప్రయాణికులు, పర్యాటకులకు వివిధ రకాల స్నాక్స్, టీ అందిస్తామన్నారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. ఇతర మండలాల నుండి అర్జీదారులు జిల్లా కేంద్రానికి రాకూడదని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | ఫిబ్రవరి 03, 2025 | www.navatelangana.com

అభివృద్ధిని పర్యవేక్షించిన కేంద్ర బృందం

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని సోమగూడెం పంచాయితీలో ఆదివారం కేంద్ర అధికారుల బృందం పర్యటించింది. అధికారులు జాతీయ ఉపాధి హామీ పనుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పథకాలను గురించి ఏపీఓ డేవిడ్‌ను తెలుసుకున్నారు. పంచాయితీ నర్సరీ పనులను సీసీ రోడ్ల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహేందర్. ఎంపీ ఓ శ్రీనివాస్ సెంట్రల్ టీం అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వసంత పంచమి వేడుకలు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పలు దేవాలయాల్లో వసంత పంచమి వేడుకలను దేవాలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా ఆదివారం జన్నారం గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో శ్రీ సరస్వతీ మాత చిత్రపటానికి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు, ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దీంతో దేవాలయంతో పాటు పరిసర గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.

వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులు కాలయాపన చేయకుండా వెంటనే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టాస్కు) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పి. శంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టాస్కు) ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా లేని స్వచ్ఛంద సంస్థ అని, తల్లిదండ్రులు, వయోధికుల పోషణ సంక్షేమ చట్టం 2007 రూల్ 20 కచ్చితంగా అమలు చేయాలన్నారు. మెయింటెనెన్స్ ట్రిబ్యునల్, అప్పిలేట్ ట్రిబ్యునల్ నిర్ణీత సమయంలో తీర్పును వెలువరించి అమలుపరిచేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, సీనియర్ సిటిజన్ల కొరకు ప్రతి మండలంలో డే కేర్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని, ఉచిత వైద్యం అందించాలని, ఉచిత రైల్వే, బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని, వయోవద్ధుల సంక్షేమం కొరకు బడ్జెట్ లో ఐదు శాతం నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. 2007 చట్టం సెక్షన్ 21 ప్రకారం వద్ధులకు పోలీస్ శాఖ రక్షణ కల్పించాలని కోరారు. వద్ధులను గెంటివేస్తే సెక్షన్ 24 ప్రకారం విధించే శిక్ష, జరిమానాలను పెంచాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా టాస్కు కమిటీలు వేస్తామని, టాస్కు బలోపేతానికి ప్రతి ఒక్కరు కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టాస్కు జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కనకయ్య, కలవేని సమ్మయ్య కే. నరసింహారెడ్డి, గంగ్ర రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నవతెలంగాణ-తాండూర్

మండలంలో రేపల్లెవాడ సెయింట్ తెరిస్సా హై స్కూల్‌లో ఆదివారం ఘనంగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాండూర్ సీఐ కుమారస్వామి, మండల విద్యాధికారి మల్లేష్, తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ కుమారస్వామి మాట్లాడుతూ సమాజాన్ని ప్రగతి పదథం వైపు నడిపించడంలో విద్యాలయాల పాత్ర ఎంతగాతో ఉందన్నారు. బోధన సిబ్బంది విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేయాలని తెలిపారు. పాఠశాల స్థాయిలో నేర్పించే విద్య విద్యార్థి ప్రగతికి దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులను చదువుతోపాటు, కళా రంగాల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయులతో పాటు, తల్లిదండ్రుల పాత్ర ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల క్రమశిక్షణ నడవడికలపై శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాల వైపు వారి ఆలోచనలను మళ్ళింపజేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ అంటోని, వైస్ ప్రిన్సిపాల్ జోస్లుకోస్, సారా, పీఈటీ శ్రీకాంత్ బోధన పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకల అనుమతికి ఎమ్మెల్యే కృషి



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని గ్రామాలకు మండలాలకు పట్టణాలకు భారీ వాహనాల రాకపోకలపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి అనుమతుల కోసం కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ ఆలీ ఖాన్, జిల్లా నాయకుడు ఇసాక్ అన్నారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. స్థానిక ఎఫ్ పీటీతో మాట్లాడి వాహనాల రాకపోకలపై నిషేధాన్ని సడలించడానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మాణిక్యం, నాయకులు మచ్చ శంకరయ్య, దుమల రమేష్, మామిడిపల్లి ఇందయ్య, ముత్యం రాజన్న, నందు నాయక్, పంకజ, శేషారావు, అబ్దుల్ ముజ్జు, అజారుద్దీన్, భాస్కర్‌గౌడ్, హాయ్ శిరీష్, రాజన్న, గంగన్న, ముత్యం సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రామినేర్ ప్రశిక్షాన్ శిబిర్ ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమిలో సెంటర్ కమిటీ, దీక్ష భూమి కమిటీ, జై భీం సేన కమిటీ వారి ఆధ్వర్యంలో శ్రామినేర్ ప్రశిక్షన్ శిక్షణ కార్యక్రమం బంతే దమ్మ అమరావతి, బంతే భరద్వాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ముందుగా గౌతమ బుద్ధుని చిత్ర పటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుద్ధుడు బోధించిన త్రిశరణ్ పంచశీల, అష్టాంగ మార్గాలు పది పరమితలు ప్రతిరోజు 10 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సెంటర్ కమిటీ అధ్యక్షులు దుర్గం హుక్కు, గౌరవ అధ్యక్షులు జాడి కృష్ణాజీ, ఉపసక్ దుర్గం యశ్వంత్ రావు, డోంగ్రి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ మధ్యతరగతి ప్రజలకు తీవ్ర నష్టం

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరం అశోక్



నవతెలంగాణ-జన్నారం

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ మధ్యతరగతి ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరం అశోక్ అన్నారు. ఆదివారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా మండల కేంద్రంలో ప్లకార్డ్స్‌తో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బడ్జెట్ కంటే సుమారు రూ.3 లక్షల కోట్లు ఈ బడ్జెట్‌లో అదనంగా కేటాయించినా జీడీపీలోటు 4.4 శాతం చూపడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నదన్నారు. ఈ బడ్జెట్ సీఐటీయూ, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఈ బడ్జెట్‌లో ఫిజికల్ రెవెన్యూ లోటు రూ.15,68,936 కోట్లు కాగా నికర లోటు రూ.5,23,246 కోట్లు, మొత్తం బడ్జెట్‌లో మార్కెట్ అప్పులు రూ.11,53,834 కోట్లు ఇతర అప్పులు రూ.15,66,452 కోట్లు, మొత్తం అప్పులు రూ.27,20,286 కోట్లుగా ప్రతిపాదించడంతో ప్రస్తుత ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో మన ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నదన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్ ప్రతిపాదించకపోవడం అన్యాయం అన్నారు. విభజన హామీ చట్టంలోని అంశాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ 10 సంవత్సరాల తర్వాత కూడా పరిష్కరించే చర్యలు తీసుకోకపోవడం మోసం చేయడమే అని విమర్శించారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం మరోసారి మోసగించిందన్నారు. రైతు ఋణమాఫీ పథకం, ధరల స్థిరీకరణ, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంపును విస్మరించిందన్నారు. విద్యుత్ రంగం సంస్కరణలు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు తీవ్ర హాని కలగనున్నదన్నారు. బీమా రంగంలో ఎఫ్‌ఐలు 74 శాతం నుండి 100 శాతం పెంచడం జాతీయ బీమా సంస్థలను బలహీనం చేయడమే. ఆర్థిక సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్రం సహకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం అన్నారు. అణు ఇంధన సంస్థలను పూర్తిగా ప్రయివేటీకరించి, ఖనిజ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా కట్టబెట్టేందుకు బరితెగించిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండ గొర్ల లింగన్న లక్ష్మణ్ అబ్దుల్లా రాజన్న తదితర మహిళలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఐద్వా ఆధ్వర్యంలో..

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఐద్వా మహిళా సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు పోతు విజయశంకర్ ఆధ్వర్యంలో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు సీపీఐ(ఎం) మహిళా సంఘం నాయకులతో కలిసి ఆమె ఆదివారం మధ్యాహ్నం ంండల కేంద్రంలో ఫ్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థలను కాపాడాలని, పెట్రోల్ డీజిల్ పన్నులు రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

ముగిసిన ఎస్టీపీపీలో మొదటి దశ క్రికెట్ లీగ్ పోటీలు

- సెమీ ఫైనల్‌లో నాలుగు జట్లు
- నేటి నుండి సెమీ ఫైనల్ పోటీలు



నవతెలంగాణ-జైపూర్

పది జట్ల మధ్య నెలకొన్న ఎస్టీపీపీ క్రికెట్-2025 లీగ్ మొదటి దశ పూర్తయ్యింది. ఆదివారం ఫస్టాఫ్‌లో నాలుగు జట్ల మధ్య పోటీలో మావరిక్స్ జట్టుతో పాటు థండర్స్ స్ట్రేకర్స్ జట్లు విజయం సాధించాయి. అదేవిధంగా సెకండాఫ్‌లో తలపడిన నాలుగు జట్లలో పీఎంపీఎల్ గేమ్ చేంజర్స్ జట్టుతో పాటు సీఐఎస్‌ఎఫ్ జట్లు విజయఖేతనాన్ని ఎగురవేసింది. వివరాలను పరిశీలిస్తే ఫస్టాఫ్‌లో మొదటి మ్యాచ్ ఎస్టీపీపీ పైలెట్స్ వర్సెస్ మావెరిక్స్ జట్ల మధ్య జరిగింది. మొదటి బ్యాటింగ్ చేపట్టిన మావెరిక్స్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో ఐదు వికెట్లు నష్టపోయి 106 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఎస్టీపీపీ పైలెట్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 68 పరుగులకే పరిమితమైంది. విష్ణువర్ధన్‌రెడ్డి మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఫస్టాఫ్‌లో జరిగిన రెండవ మ్యాచ్ పీఎంపీఎల్ పవర్ స్మాషర్స్ వర్సెస్ థండర్స్ స్ట్రెకర్స్ జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన పవర్ స్మాషర్స్ నిర్ణీత ఓవర్లలో 79 పరుగులకే పరిమితం కాగా అనంతరం బ్యాటింగ్ చేసిన థండర్స్ స్ట్రెకర్స్ జట్టు 6.4 ఓవర్లలో 80 పరుగులు తీసి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఆల్ రౌండర్‌గా నిలిచిన ప్రణవ్ శర్మకు మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్ దక్కింది. సెకండాఫ్‌లో మొదటి మ్యాచ్ బీపీఏ ఎగ్జిక్యూటివ్స్ వర్సెస్ పీఎంపీఎల్ గేమ్ చేంజర్స్ మధ్య జరిగిన పోటీలో మొదట బ్యాటింగ్ చేసిన గేమ్ చేంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 126 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన బీపీఏ ఎగ్జిక్యూటివ్ జట్టు 9 వికెట్లు నష్టపోయి 67 పరుగులతో పరాజయం పాలైంది. గేమ్ చేంజర్స్ జట్టు ఆటగాడు విజయ్ ఎస్టీపీపీ డీజీఎం పంతులా నాయక్ చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్ అవార్డును అందుకున్నాడు. సెకండాఫ్ రెండవ మ్యాచ్ సీఐఎస్‌ఎఫ్ వర్సెస్ బీపీఏ ఎగ్జిగ్యూటివ్స్ జట్ల మధ్య జరిగిన పోటీలో మొదట బ్యాటింగ్ చేపట్టిన సీఐఎస్‌ఎఫ్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 111పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన బీపీఏ జట్టు 5 వికెట్లు నష్టపోయి 70 పరుగులకు మాత్రమే పరిమితమైంది. ఈ మ్యాచ్‌లో సీఐఎస్‌ఎఫ్ జట్టు ఆటగాడు అమిత్ యాదవ్ మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్ అవార్డును సొంతం చేసుకోగా ప్లాంట్ డీజీఎం పంతులా నాయక్ అవార్డును అందజేశారు.

నేటి నుండి సెమీ ఫైనల్స్

ఎస్టీపీపీ క్రికెట్ -2025 లీగ్ పోటీల్లో తలపడిన 10 జట్లలో నాలుగు జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. సోమవారం నుండి సెమీ ఫైనల్స్ కొనసాగనున్నట్లు క్రికెట్ లీగ్ చీఫ్ కో ఆర్డినేటర్ డీజీఎం పంతులా నాయక్ తెలిపారు. ఆదివారం రోజు జరిగిన పోటీల్లో తలపడి విజయం సాధించిన నాలుగు జట్లు సెమీ ఫైనల్స్‌లో తలపడనున్నాయని తెలిపారు.

నిరుపయోగంగా గ్రామీణ క్రీడా మైదానాలు

- పశువులకు ఆవాసాలుగా ప్రాంగణాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని 15 పంచాయితీ, మున్సిపాలిటీ ఉండగా గ్రామీణ, పట్టణ క్రీడా ప్రాంగణాల పేరుతో మైదానాలకు స్వాగతం బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. నిర్వాహణ లోపించి అవి అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. ఆ నాటి ప్రభుత్వ లక్ష్యం అధికారులు నిర్లక్ష్యంతో నిరుగారిపోతోంది. కనీస సౌకర్యాలు కరువై, క్రీడా సామాగ్రి లేక మైదానాలు వెలవెల బోతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం, సంబందిత అధికారులు ప్రత్యే దృష్టి పెట్టి అన్ని సౌకర్యాలు కల్పించాలని గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.

పూర్తి స్థాయిలో చేరని క్రీడా సామగ్రి

గ్రామీణ క్రీడాలను ప్రోత్సహిస్తూ క్రీడాకారులను వెలికి తీసేందుకు తెలంగాణ రాష్ట్ర క్రీడ ప్రాంగణాల పేరుతో జూలై 2022లో క్రీడ మైదానాలను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. వాలిబాల్, క్రికెట్, కబడ్డీ, వంటి ఆటలు ఆడేందుకు కిట్లు, వ్యాయామ పరికరాలను సమకూర్చింది. మండలంలో ఏర్పాటు చేసిన పలు క్రీడా మైదానాలకు క్రీడా సామగ్రి సమకూర్చక పోవడంతో నిరుపయోగంగా మారాయని పలువురు ఆరోపిస్తున్నారు. మైదానాలను మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ పరిధిలో అందుబాటులో లేకుండా ఎక్కడో దూరంగా ఏర్పాటు చేశారు. దూరంగా ఉండటంతో ఎవరు కూడా అటు కన్నెత్తి చూడటం లేదని వాదనలు వినిపిస్తున్నాయి.

కరువైన అధికారుల పర్యవేక్షణ

క్రీడా మైదానాల ఏర్పాటుకు ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఏర్పాటు చేశారు గాని విటి పర్యవేక్షణ మరిచారు. వాటి ఏర్పాటుకు మంజూరైన రూ. లక్షల నిధులు వృధా అయ్యాయి. ఏర్పాటుచేసిన క్రీడా మైదానాలు అక్కరకు రాకపోగా పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి జంతువులకు ఆవాసాలుగా మారుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వధా కావడం, ఆట స్థలాలు అందుబాటులోకి రాకపోవడంతో గ్రామీణ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి మైదానాలను పునరుద్ధరించి అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

వర్గీకరణ తర్వాతే ఉద్యోగాలు భర్తీ చేయాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎస్సీ సామజిక వర్గంలో ఏబీసీడీ వర్గీకరించిన తర్వాతే ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని ఎంఆర్పీఎస్ జిల్లా నాయకులు చిప్పకుర్తి నారాయణ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంతి భవన ఆవరణలో నూతనంగా ఎన్నికైన ఎంఆర్పీఎస్ పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులను మాదిగ ఎంప్లాయిస్ సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్ష డప్పులు, వేల గుంతుల కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు. ప్రతి ఊరి నుంచి వేలాదిగా మాదిగలు హైదరాబాదుకు తరళిరావాలని కోరారు. ఏబీసీడీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేంత వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అవునూరి లచ్చన్న, ముల్కల్ల రంజిత్, ఏజీపీ వేల్పుల సత్యం, గొడిసెల రవి, చాతరాజు శివశంకర్, కలాల రమేష్, అల్లంపల్లి రమేష్, చాతరాజు రాజశేఖర్, మండల అధ్యక్షుడు అవునూరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మంద మధు, పట్టణ అధ్యక్షుడు కల్లేపల్లి విక్రం, అడ్లూరి శివకుమార్ పాల్గొన్నారు.

పెగడపల్లి శివాలయంలో చోరీ



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెగడపల్లి గ్రామంలో గల శివాలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం గర్భ గుడి తలుపుల బద్దలుకొట్టిన దుండగులు దేవతా విగ్రహాలకు ఉన్న వెండి పడగలు, అమ్మవారి మంగళ సూత్రం దోచుకున్నారు. అదేవిధంగా శివాలయంలో గల హుండీని ఎత్తుకెళ్లిన దుండగులు హుండీ పగులగొట్టి అందులో గల నగదును తీసుకుని పంట పొలాల మధ్య పడవేశారు. శనివారం అర్ధరాత్రి ఆలయానికి చేరుకున్న దుండగులు ముందు సీసీ కెమెరాల కనెక్షన్ వైర్లు కట్ చేసి చోరికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. యదావిధిగా ఆదివారం ఆలయానికి వచ్చిన అర్చకులు మల్లయ్య గుడి తలుపులు తెరుచుకుని ఉండటం చూసి ఆలయంలో చోరి జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు జైపూర్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసిన అర్చకులు మల్లయ్య చోరికి పాల్పడిన దుండగులు దేవతామూర్తుల వెండి ఆభరణాలు దోచుకోవడంతో పాటు హుండిని పగులగొట్టినట్లు తెలిపారు. కాగా దోపిడికి గురైన దేవతామూర్తుల ఆభరణాల ఖరీదు సుమారుగా రూ. 98 వేలు వరకు ఉంటుందని స్థానికులు అభిప్రాయడుతున్నారు. చోరీ విషయం తెల్సుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తా



నవతెలంగాణ-నస్పూర్

ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సురిమిల్ల వేణు అన్నారు. ఆదివారం నస్పూర్ మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేణును ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘం అభివద్ధికి, నస్పూర్ మున్సిపాలిటీ అభివద్ధికి తను ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని, తాను ఎప్పుడు అండగా ఉంటానని తెలిపారు. ఇన్ని రోజులు తనకు మద్దతు తెలిపిన ప్రజలకు, మాల సంక్షేమ సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు గోశిక మనోజ్ కుమార్, మహిళ మాల బాంధవులు సారంగుల శైలజ,మాల సంఘం నాయకులు ధోనిపల్లి లింగయ్య , గరిసే రామస్వామి, జవాజీ నందయ్య, కొంపల్లి పోషం, బోండ మోహన్, బాబురావు, ఈవెంట్ ఆర్గనైజర్ పండుగ శ్రీనివాస్, కిరణ్ కుమార్, సంకె సతీష్, భోగి నరహరి, బత్తుల వెంకటస్వామి, కోడి రమేష్ పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-నస్పూర్



నస్పూర్ మున్సిపాలిటీలో 14వ వార్డు కౌన్సిలర్‌గా ఐదేండ్ల పాటు పనిచేసిన కేడిక ప్రకాష్ రెడ్డిని నస్పూర్ రెడ్డి పరివార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. రెడ్డి సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు మోతే రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కేడిక ప్రకాష్ రెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రకాష్ రెడ్డి వార్డు కౌన్సిలర్‌గా ప్రజలకు ఎనలేని సేవలు అందించారని, నిరంతరం ప్రజాసేవలో తరించారని కొనియాడారు. ఆయన రాజకీయ జీవితంలో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు హనుమండ్ల వెంకట్ రెడ్డి, సలహాదారు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి. కోశాధికారి చెరుకు చంద్రశేఖర్ రెడ్డి, నోముల నరేందర్ రెడ్డి, ఆళ్ల రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.